క్లుప్తంగా

ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలి



పిల్లల ఎత్తు, బరువు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ ఉషారాణి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి సూచించారు. మండలంలోని రంగప్పవలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు, సరుకుల నిల్వలు, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందివ్వాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, వారికి పక్కాగా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలావతి

రేగిడి: యువత, విద్యార్థులంతా మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన పౌరులుగా జీవించాలని ఎస్ఐ నీలావతి ఆకాంక్షించారు. మండలంలోని ఉంగరాడమెట్ట, సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని కోరారు.

పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి భూమిపూజ



తాగునీటి తొట్టెల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలిరూరల్: మండలంలోని కొత్తపెంట గ్రామంలో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో ఈ నిర్మాణాలు చేయనున్నామని, పశువుల దాహార్తి తీర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి నిర్మాణాలు జరగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి. రవికుమార్, ఏపీవో లక్ష్మీపతిరాజు, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్డ సంచులు వినియోగించాలి



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్క సాయిబాబు నాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఓ ప్రైవేటు కార్యాలయం వద్ద పలువురు పట్టణ వాసులకు గుడ్డ సంచులు మంగళవారం పంపిణీ చేశారు. సంఘం ఆధ్వర్యంలో వీటిని అందజేసి, పాలిథిన్ నిషేధానికి కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ నిషేధిత పాలిథిన్ సంచులు వాడకుండా గుడ్డ సంచులనే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, రాజాం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేత



కేంద్రమంత్రిని కలిసిన సోరు సాంబయ్య తదితరులు

బొబ్బిలి: రాజ్యాంగం ప్రసాదించిన కమ్యునల్ అవార్డులను అమలు చేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని బొబ్బిలికి చెందిన అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య కోరారు. ఇదే విషయమై ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రి శ్రీరామ్‌దాస్ అదేవాల్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కమ్యునల్ అవార్డుల అమలు లక్ష్యంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా, నిరసన కార్యక్రమాల అనంతరం కేంద్రమంత్రిని కలిశామని, కమ్యునల్ అవార్డులు ఎలా సాధించాం.. ఎప్పటి నుంచి అవి ఆగిపోయాయి.. ఇప్పుడు వాటి అమలు అడ్డుకుంటున్న వారి వివరాలను కూలంకుషంగా వివరించామని సాంబయ్య తెలిపారు.

కొత్త రేషన్‌కార్డుల జారీ ఎప్పుడో?

- రేషన్‌కార్డుల మంజూరులో తీవ్ర జాప్యం
- నియోజకవర్గంలో 1200లకు పైగా దరఖాస్తులు
- కొత్తగా పెళ్లయిన వారికీ తప్పని ఎదురుచూపులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం





రాజాం: కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొత్తకార్డులు ఎప్పుడిస్తారా అని గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు రేషన్‌కార్డుల జారీపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఏడాది కాలంగా కొత్తకార్డుల జారీ చేపట్టకపోవడంతో కొత్తగా పెళ్లయిన వారితో పాటు ఇప్పటికే కార్డుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వం చెప్పే శుభవార్త కోసం వేచి చూస్తున్నారు.

గతంలో ప్రతి 6 నెలలకోసారి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలలకోసారి కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ జరిగేది. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా రేషన్‌కార్డులు అందించేవారు. దీంతో ఏ ఒక్కరూ నష్టపోయేవారు కాదు. ఇప్పుడు కొత్త రేషన్‌కార్డుల ప్రసక్తే లేకపోగా.. ఈకేవైసీ పేరిట ఉన్న కార్డుల్లోని లబ్ధిదారులను తొలగించేందుకు చంద్రబాబు సర్కారు ప్రయత్నాలు చేస్తుండడాన్ని జనమంతా తప్పుబడుతున్నారు.

పెండింగ్‌లో దరఖాస్తులు..

ఏడాది కాలం నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలో ఇదివరకు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మందికి పైగా దరఖాస్తుదారులు, కొత్తగా పెళ్లయిన వారు, కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం చూసే వారంతా ప్రభుత్వ ప్రకటన కోసం వేచి చూస్తున్నారు. కొన్ని దగ్గర్ల గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు అయితే దరఖాస్తులు తీసుకుని, దరఖాస్తుదారులు వెళ్లగానే వాటిని చెత్తబుట్టల్లో పడేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డులు లేకపోవడంతో పలువురికి ధ్రువీకర ణపత్రాల మంజూరులోనూ ఎదురీత తప్పడం లేదు. ఈ విషయాన్ని రాజాం సీఎస్‌డీటీ చిరంజీవి వద్ద సాక్షి ప్రస్తావించగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు ప్రక్రియ ప్రారంభం కాలేదని, త్వరలోనే జరిగే అవకాశం ఉందని తెలిపారు.

మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులు..

మండలం	దరఖాస్తుల సంఖ్య
రాజాం	420
రేగిడి	370
సంతకవిటి	290
వంగర	120

దరఖాస్తు చేసి సంవత్సరమైంది..

కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరమైంది. ఇంతవరకు రేషన్‌కార్డు కాదు కదా రైస్‌కార్డు కూడా రాలేదు. కొత్త రేషన్‌కార్డుల మంజూరులో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ప్రకటన చేయాలి. – కేవీ ఉమాశంకర్, రాజాం

ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నాం..

రేషన్‌కార్డులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నాం. పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తెచ్చుకుని మరీ దరఖాస్తు చేసినా ఫలితం లేదు. సచివాలయానికి ఎప్పుడూ దరఖాస్తులు ఇవ్వడమే తప్ప కొత్తకార్డులు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని నూతన కార్డులు ఇవ్వాలి.
– ఆర్.మహేశ్వరరావు, రేగిడి మండలం

అవిశ్వాస తీర్మానంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఏదీ?

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు

బొబ్బిలి: మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం పెడతామని చెబుతుండడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు కనబరచడం లేదు అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ప్రశ్నించారు. ఇదే విషయమై స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. బొబ్బిలి మున్సిపాలిటీలో చైర్మన్ మార్పు అని, అవిశ్వాస తీర్మానం పెడతారంట.. ఇలా కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలు పట్టణ ప్రజలను తీవ్ర విస్మయానికి గురిచేస్తున్నాయన్నారు. కొందరి స్వార్థ రాజకీయాల కోసమే అవిశ్వాస తీర్మానమని విమర్శించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు చేసిన ప్రకటనలు చూస్తే బొబ్బిలి అభివృద్ధి ఆగిపోయిందని, అందుకే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నారని చెప్పడం విడ్డూరమన్నారు. మీకు ఓట్లేసిన పాపానికి ప్రజలు సిగ్గుపడాలి తప్ప మీకేం పట్టినట్లు లేదన్నారు. మీకు దమ్మూ ధైర్యం ఉంటే మున్సిపల్ పన్నులు పెంచే జీవోను ప్రభుత్వం తీసుకువస్తోందని, దానిని ఆపాలని సవాలు విసిరారు. గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమలు, సుగర్ ఫ్యాక్టరీ పునర్నిర్మాణం, బృహత్తర తాగునీటి పథకం వంటి నిర్మాణాలకు చర్యలు తీసుకోగలరా అని నిలదీశారు. గొల్లపల్లి–ఆర్టీసీ కాంప్లెక్స్ బైపాస్ రోడ్డు నిర్మాణం ఈ అవిశ్వాస తీర్మానంతో జరుగుతుందా? ఇది కేవలం స్వప్రయోజనాలు, మీ ఆస్తులు పెంచుకోవడం కోసమేనని విమర్శించారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు పక్కనబెట్టి ప్రజలకు మంచి జరిగే పనులు చేయాలని హితవుపలికారు. అలాగే పెండింగ్‌లోని ఉపాధి హామీ పథకం వేతనదారుల బిల్లులు, కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని, వేతనదారులకు రోజుకు రూ.300 కనీస వేతనం వచ్చేలా చూడాలని కోరారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టు రాకుండా అడ్డుకుంటున్నారు..



విలేకరుల ముందు తన గోడు చెప్పుకుంటున్న సోనియాకుమారి

బొబ్బిలి రూరల్: తనకు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు(ఉద్యోగం) రాకుండా అడ్డుకుంటున్నారని బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన యర్రారపు సోనియా కుమారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఆమె గ్రామంలోని స్వగృహం వద్ద విలేకరులకు తన గోడు మంగళవారం చెప్పుకుంది. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–6లో ఆయాగా పనిచేస్తున్న తాను ఇదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నానని అయితే కూటమి నాయకులు తనకు కాదని వేరే మహిళకు ఆ పోస్టు ఇచ్చేందుకు కుట్ర చేస్తున్నారని వాపోయారు.
తాను ఓ దళిత మహిళను అనే అక్కసుతోనే వారు తనకు ఆ పోస్టు రాకుండా చేస్తున్నారన్నారు. ఇక్కడి కార్యకర్త రాజీనామా చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ పోస్టు భర్తీ చేయడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ఆ పోస్టు కోసం పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆమె ఆరోపించారు. తనకు అన్యాయం జరిగితే న్యాయ పోరాటానికి అయినా సిద్ధమేనన్నారు.

పెన్షన్ డబ్బులు చోరీ

సంతకవిటి: సంతకవిటి సచివాలయం వీఏఏ నవ్య మండలంలోని మామిడిపల్లి గ్రామంలో మంగళవారం పెన్షన్ డబ్బులు పంచుతుండగా తన స్కూటీలో ఉంచిన రూ. 20వేలు ఎవరో చోరీ చేశారని పంచాయతీ కార్యదర్శి కె.కోటేశ్వర రావుకు తెలియజేశారు. దీనితో ఆయన ఎంపీడీఓ కె.సురేష్ కుమార్ దృష్టిలో పెట్టగా ఆయన ఎస్సైకి ఫిర్యాదు చేయాలని సూచించడంతో పోలీస్‌స్టేషన్‌నుకు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు నవ్య తెలిపారు.

80 శాతం పన్నులు వసూళ్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని 30 పంచాయతీల్లో మొత్తం 85 శాతం పన్నులు వసూలు చేసినట్లు ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు మంగళవారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.50.19 లక్షల ఆస్తి, వాణిజ్య పన్నుల వసూళ్లను లక్ష్యంగా చేసుకున్నామని, ప్రస్తుతం రూ.42.66 లక్షలు వసూలు చేశామన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి శతశాతం పన్నుల వసూళ్లు చేస్తామన్నారు.

బొబ్బిలి టీడీపీలో ముసలం!



వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మున్సిపాలిటీలోని టీడీపీలో ముసలం మొదలైంది. ఎమ్మెల్యే బేబీనాయన సోదరుడు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు వ్యవహార శైలి సొంత పార్టీ నేతలపై కుంపటి తెచ్చి పెడుతోంది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను టీడీపీలోకి ఆయన ఆహ్వానిస్తుండడాన్ని వారంతా వ్యతిరేకిస్తున్నారు. వారొస్తే తాము ఏం కావాలని ప్రశ్నిస్తున్నారు. ఏ వార్డుకు ఇన్‌చార్జ్‌లుగా ఉండాలని, తమ భవితవ్యం ఏమిటని లోలోపల మదనపడుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బేబీనాయనను, టీడీపీని అప్పట్లో విమర్శించిన ఇప్పటి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల(టీడీపీలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న) వీడియోలను టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. దీంతో సొంత పార్టీలోనే అసమ్మతి సెగలు పుట్టుకొస్తున్నాయని ఆ పార్టీ(టీడీపీ) వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఇటీవల విశాఖపట్నంలో పలువురు బొబ్బిలి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావును కలవడం, ఆ తర్వాత ఆయన టీడీపీలోకి వచ్చేందుకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారని మాట్లాడడం వంటివి ఆ పార్టీ నేతల్లోనే గుబులు పుట్టిస్తున్నాయి. వారొస్తే మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న తామేం కావాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మారే కౌన్సిలర్లకే మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు కూడా ఇస్తామని మాజీ మంత్రి హామీ ఇవ్వడంతో ఎంతోకాలంగా ఉంటున్న తమకు సీట్లు ఇవ్వరా అని అంటున్నారు. ఈ క్రమంలో కొంతమంది టీడీపీ నాయకులు పింఛన్ పంపిణీ సహా పలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీని విమర్శించిన ప్రతిపక్ష పార్టీ నాయకులను ఆహ్వానించడం, వారికి సీట్లు ఇచ్చి మళ్లీ అందలం ఎక్కించే ప్రయత్నం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదంటున్నారు. పలువురు నేతలు ఇదే విషయమై ఫోన్‌లో కూడా గొడవలు పడుతున్నట్లు తెలుస్తోంది.

అంతిమంగా న్యాయమే గెలుస్తుంది..

రాజకీయాల్లో అంతిమంగా న్యాయమే గెలుస్తుందని. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కౌన్సిలర్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. మన పార్టీ కౌన్సిలర్లను లాక్కుని, అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైనా సాంకేతికంగా అది చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు.

అభినందనలు



సీఐ నారాయణరావును అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

రామభద్రపురం: గంజాయి కేసులో నిందితులను పట్టుకుని, అరెస్ట్ చేయడంలో విశేష కృషి కనబరిచిన సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావులతో పాటు సిబ్బంది వై.రమేష్, ఎస్.రవి, ఎ.ధర్మారావు, పి.నాగార్జునలను ఎస్పీ వకుల్ జిందల్.. ప్రశంసాపత్రాలతో విజయనగరంలో మంగళవారం అభినందించారు. రామభద్రపురం మండలంలోని కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన 147 కిలోల గంజాయి కేసులో నలుగురు నిందితులను పట్టుకుని, అరెస్ట్ చేయడాన్ని ఎస్పీ అభినందించి, ప్రోత్సహించారు. ముున్ముందు కూడా ఇదే చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.



రాజాం: శ్యామ్‌ను అభినందిస్తున్న డాక్టర్ రాజేష్

రాజాం: వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాజాం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన పాలవలస శ్యామ్‌ను పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అభినందించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను సత్కరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలని శ్యామ్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు

బాడంగి: ఎస్సీ వర్గీకరణతోనే ఎస్సీ ఉప కులాలకు మేలు అని ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను మాదిగ అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శాసనమండలిలో కూటమి ప్రభుత్వానికి తగిన బలం లేనందున మాదిగ కులానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులంతా శాసనమండలిలో బిల్లుకు ఆమోదం తెలపాలని ఎమ్మెల్సీలను డిమాండ్ చేయాలన్నారు. గవర్నర్ ఆర్డినెన్స్ తీసుకువచ్చి, విద్య, ఉద్యోగ రంగాల్లో ఏబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కిల్లాడ సురేంద్ర మాదిగ, బోడెల రవి మాదిగ, అనకాపల్లి నాగేశ్వరరావు మాదిగ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను

భూ ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ హెచ్చరించారు. తెర్లాం మండలంలోని కుసుమూరులోని శ్మశాన వాటిక భూములు ఆక్రమణకు గురవుతున్నాయని స్థానికులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు సహా ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో గోవింద్‌లు మంగళవారం వెళ్లి, శ్మశానవాటిక భూముల ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డు ఏర్పాటు చేశారు. – తెర్లాం



పాలిథిన్ నిషేధానికి సహకరించండి

పాలిథిన్ నిషేధానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కోరారు. రాజాంలోని దేవీ శ్రీదేవి కల్యాణ మండపంలో ఉచిత యోగా శిక్షణా తరగతులకు హాజరైన వారికి గుడ్డ సంచులు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిషేధిత పాలిథిన్ సంచులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల పర్యావరణం కలుషితమవుతోందని, తద్వారా జీవకోటి మనుగడ ప్రశ్నార్థమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ సంచులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. అందరూ సహకరిస్తేనే ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టగలమన్నారు. కార్యక్రమంలో యోగా గురువు టీటీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. – రాజాంసిటీ



తరగతులు ప్రారంభమైనా.. కళాశాల తెరవలేదు..

ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమైనా రామభద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రం తెరుచుకోలేదు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే తరగతుల నిర్వహణ అనడంతో విద్యార్థులంతా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ పేరిట నిర్వహిస్తున్న కళాశాలకు మంగళవారం ఉదయం చేరుకున్నారు. అయితే అక్కడ తరగతి గదులకు తాళాలు వేసి ఉండడంతో విద్యార్థులు వెనుదిరిగారు. అసలు ఎప్పటి నుంచి క్లాసులు ఎవరు చెప్తారు.. ఎలా తెలుస్తుందన్న అయోమయంలో విద్యార్థులు పడిపోయారు. – రామభద్రపురం



పేరుకు తగ్గ హుందా ఉండొద్దా..?

- ఎంపీ లావు కృష్ణదేవరాయలు వైఖరిపై ఎమ్మెల్సీ మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: విజయనగర సామ్రాజ్యానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు అని, అదే పేరు పెట్టుకుని, ఆ మహానుభావుడి పేరుకు ఉన్న పరువుతీస్తున్నావని టీడీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయలపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. పేరుకు తగ్గట్లు హుందాగా ఉండొద్దా అని ఎద్దేవా చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించి, మాట్లాడారు. పార్లమెంటులో ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడిన మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో లిక్కర్ కుంభకోణం జరిగిందని ఆయన చేసిన ఆరోపణల వెనక నిజం లేదని అదంతా వైఎస్సార్ సీపీపై బురదజల్లే ప్రయత్నమేనని ధ్వజమెత్తారు. అప్పట్లో రూ.2 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని, ఆ నిధులు దుబాయ్‌కు తరలిపోయాయని ఆయన చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. అంతకుముందు ఆ డిస్టలరీలకు చంద్రబాబే అనుమతులిచ్చారని, ఈ లెక్కన ఆయన ఆరోపిస్తున్న స్కాం వెనక చంద్రబాబు ఉండి ఉంటారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అక్రమ మద్యం రవాణా కట్టడికి, మద్యం విక్రయాల్లో జరిగే అవకతవకలను అరికట్టేందుకే అప్పుడు ప్రభుత్వమే మద్యం విక్రయాలు చేపట్టిందని గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహించడం ద్వారా చాలామంది నిరుద్యోగులు ఆ షాపుల్లో పనిచేసి ఉపాధి పొందారన్నారు. ఇప్పుడు మద్యం షాపులను ప్రైవేటుపరం చేస్తూ వారి ఉద్యోగాలను కూడా పీకేశారన్నారు. రూ.100లకే నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి నాసిరకం మందు విక్రయిస్తున్నారని, అలాగే మద్యం రేట్లు తగ్గిస్తామని చెప్పి ధరలు పెంచేశారని విమర్శించారు. ఎవరెన్ని కుయుక్తులు, కుతంత్రాలు, కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ నుంచి ప్రజలను దూరం చేయలేరన్నారు. ఎన్నికల హామీలు అమలు గాలికొదిలేసి లేనిపోని ఆరోపణలతో ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తే జనమేమీ తెలివితక్కువ వారేమీ కాదని వారంతా గమనిస్తున్నారన్నారు. సమయం చూసి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అర్థరహితమైన ఆరోపణలు మాని ప్రజలకు మేలు చేసే పనులు, కార్యక్రమాలు చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

తెర్లాం/బాడంగి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం జరిగింది. తెర్లాం మండలంలో 96 శాతం, బాడంగి మండలంలో 97 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీవోలు రేగి రాంబాబు, శంబంగి రామకృష్ణలు తెలిపారు. స్థానిక పింఛన్‌దారుల్లో సొంత పనుల నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లిన వారికి పింఛన్లు ఇవ్వలేకపోయామని, వారొచ్చిన తర్వాత వారికి కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.